AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in
13-8-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

కార్మికులకు అందని వైద్యం 2






ఇష్టారాజ్యంగా ఇసుక రవాణ 2

## 24 నుంచి జెండా జాతర ఉత్సవాలు

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని జెండా బాలాజీ ఆలయ జాతర ఉత్సవాలు ఈనెల 24 నుంచి ప్రారంభమవుతున్నట్లు వంశపారం పర్య అర్చకులు అజయ్ సంగ్వాయి తెలిపారు. ఇందులో భాగంగా బాలాజీ జెండా శోభాయాత్ర నగరంలోని పెద్ద బజార్‌లోని తమ స్వగృహం నుంచి ప్రారంభమవుతుందన్నారు. అక్కడి నుంచి బార్సింగ్ బాబా మందిరం గాజుల్‌పేట్, హనుమాన్ మందిరం, పెద్ద రాంమందిర్, చక్రం గుడి, చిన్న రాంమందిర్, తిరిగి పెద్ద బజార్ చౌరస్తా, బబుల్ రథం ఆలయం కసాబ్ గల్లి, నర్సా గౌడ్ హనుమాన్ ఆలయం మీదుగా జెండా బాలాజీ ఆలయానికి చేరుకుంటుందన్నారు. ఆలయంలో జెండాను ప్రతిష్ఠించిన అనంతరం 15 రోజులపాటు నిత్య పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



## శ్రీరాంసాగర్‌కు పెరుగుతున్న ఇన్‌ఫ్లో..

**అక్షరటుడే ఆర్మూర్:** ఎగువన కురుస్తున్న వర్షాలకు తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద పెరుగుతోంది. నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టులోకి నీళ్లు వస్తున్నాయి. జలాశయంలో సోమవారం నాటికి 34,734 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. మంగళవారం ఉదయం 9 గంటలకు 5,658 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోకు పడిపోయింది. కాగా.. బుధవారం ఉదయం 5,498 క్యూసెక్కులకు తగ్గింది. మధ్యాహ్నానికి 12,769 క్యూసెక్కులకు పెరిగింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 44.937 టీఎంసీలు, 1080.00 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు పరిధిలోని 6,24,000 ఎకరాలకు ప్రస్తుతం నీటిని వదులుతున్నారు. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 47.549 టీఎంసీలు, 1080.90 అడుగులు నీటి నిల్వ ఉంది. కాకతీయ కాలువ ద్వారా 3,500 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 3,000 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. లక్ష్మి కాలువ ద్వారా 150 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 800 క్యూసెక్కులు వదులుతున్నారు. ఆవిరి రూపంలో 482 క్యూసెక్కులు పోతోంది. గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతలకు నీటి విడుదలను బుధవారం నిలిపివేశారు.




# ఇక టోల్‌పాస్

- ఆగస్టు 15 నుంచి అమలులోకి కొత్త విధానం
- రూ.3 వేలతో 200 ట్రిప్పులకు అవకాశం

**జాతీయ రహదారులపై ప్రయాణించాలంటే టోల్ భారం భరించకతప్పదు. ముఖ్యంగా నిత్యం ఆయా మార్గాల్లో ప్రయాణించేవారు టోల్ ఫీజులతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వాహనదారులకు ఊరట కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం వార్షిక టోల్ పాస్‌లను తీసుకొచ్చింది. ఒక్కసారి పాస్ తీసుకుంటే ఏడాదిపాటు ప్రయాణం చేయవచ్చు. ఆగస్టు 15 నుంచి కొత్త విధానం అమలులోకి రానుంది.**

**- అక్షరటుడే, ఇందల్వాయి**

ఉద్యోగం, వ్యాపార నిమిత్తం జాతీయ రహదారులపై చాలా మంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వీరికి ఏడాది పాస్‌తో ఎంతో మేలు జరగనుంది. గతంలో టోల్ ప్లాజా దాటాలంటే ఒకసారి రూ.95 చెల్లించాల్సి వచ్చేది. రానుపోను కలిపి రూ.190 కట్టాలి. నెలకు ఒకసారి వెళ్లి వచ్చిన 24 ట్రిప్పులకు రూ.2,280 టోల్ కట్టాల్సి వచ్చేది. అంతకంటే ఎక్కువసార్లు ప్రయాణించే వారు వేల రూపాయలు టోల్ గేట్ల వద్ద చెల్లించేవారు. ఇలాంటి వారికి వార్షిక పాస్ ఎంతో మేలు చేస్తుంది. ఒకసారి రూ.మూడు వేలు చెల్లిస్తే ఏడాది పాటు ఈ పాస్‌తో 200 ట్రిప్పులు ప్రయాణించే సౌకర్యం ఉంటుంది. అంటే 200 సార్లు టోల్‌గేట్ ద్వారా ప్రయాణం చేయవచ్చు.

### ఇలా పొందవచ్చు

వార్షిక టోల్‌పాస్‌లను ఈ నెల 15 నుంచి జారీ చేయనున్నారు. అన్ని జాతీయ రహదారులపై ఈ పాస్‌తో ప్రయాణం చేయవచ్చు. రాజ్ మార్గ్ యాత్ర మొబైల్ యాప్, ఎన్‌హెచ్ఏఐ వైబ్‌సైట్ ద్వారా ఈ పాస్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వాహనాల రిజిస్ట్రేషన్ వివరాలు అప్‌డేట్ అయి ఉండాలి. అనంతరం వాహనానికి ఇదివరకే తీసుకున్న ఫాస్టాగ్ వివరాలు రిజిస్ట్రేషన్ నెంబర్ ఆధారంగా మొబైల్ యాప్ లేదా వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. డబ్బులు చెల్లించిన తర్వాత రెండు గంటల్లోగా వార్షిక పాస్ యాక్టివేట్ అవుతుంది. అయితే ఈ పాస్ వాణిజ్య వాహనాలు, ట్యాక్సీలకు వర్తించదు. ఒక వాహనానికి జారీ చేసిన పాస్‌ను మరో దానికి వినియోగించే వీలు లేదు.

### జాతీయ రహదారులపైనే..

వార్షిక టోల్‌పాస్ జాతీయ రహదారులపై మాత్రమే పనిచేస్తోంది. రాష్ట్ర రహదారులపై ప్రయాణించాలంటే టోల్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. పాస్ తీసుకున్న వారు ఒక్కసారి టోల్‌గేట్ దాటితే ట్రిప్‌గా పరిగణిస్తారు. ఇలా 200 సార్లు ప్రయాణం చేయవచ్చు. ప్రస్తుతం ఉన్న ఫాస్టాగ్ ద్వారానే పాస్ పొందవచ్చు. అయితే వార్షిక పాస్ తీసుకోవడం తప్పని సరి కాదు. పాస్ వద్దనుకుంటే.. ప్రస్తుతం ఉన్న ఫాస్టాగ్ ద్వారా చెల్లింపులు చేయవచ్చు.

### వీరికి మేలు

ఇందల్వాయి టోల్ ప్లాజా నుంచి నిత్యం 15 వేల నుంచి 16 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. దీంతో టోల్‌గేట్ ద్వారా నిత్యం లక్షలాది రూపాయల ఆదాయం వస్తుంది. అయితే వార్షిక పాస్ తీసుకొస్తే ప్రజలకు భారం తగ్గనుంది. వ్యాపారం, ఉద్యోగం నిమిత్తం ఎక్కువగా జాతీయ రహదారులపై రాకపోకలు సాగించే వారికి వార్షిక పాస్ ఎంతో మేలు చేయనుంది. ప్రస్తుతం నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే మూడు టోల్‌గేట్లు దాటాలి. రాను పోనూ టోల్ ఛార్జీల రూపంలో రూ.600 చెల్లించాలి. నెలకు రెండు సార్లు వెళ్లిన ఏడాదికి రూ.14,400 టోల్ గేట్లకు కట్టాల్సి ఉంటుంది. ఇలాంటి వారు వార్షిక పాస్ తీసుకుంటే.. రూ.మూడు వేలతో 200 ట్రిప్‌లు రాకపోకలు సాగించవచ్చు.

### ఎంతో ప్రయోజనకరం



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వార్షిక టోల్ పాస్‌తో నాలాంటి వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. నేను హైదరాబాదులో బ్యాంక్ ఉద్యోగిగా పని చేస్తున్నా. సెలవు రోజుల్లో ప్రతి ఆదివారం సొంత ఊరు వస్తాను. నెలకు దాదాపు రూ.2 వేలపైనే టోల్ ఛార్జీల రూపంలో కడుతున్నాను. పాస్ తీసుకుంటే రూ.3 వేలతో ఏడాది పాటు ప్రయాణించవచ్చు. **– గడ్డం కిశోర్ రెడ్డి, బ్యాంకు ఉద్యోగి, చంద్రాయన్‌పల్లి**




విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

## ఆర్వోబీల నిర్మాణంలో జాప్యంపై రాష్ట్ర ఆర్థికమంత్రిని కలుస్తా..

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలో జాప్యం చేయడంతోనే ఆర్వోబీల పనులు ఆలస్యమవుతున్నాయని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. త్వరలోనే స్టేట్ ఫైనాన్స్ మినిస్టర్‌ను కలుస్తానని పేర్కొన్నారు. నగర శివారులోని మాధవనగర్, అర్సపల్లి, అడవి మామిడిపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.కోట్లలో నిధులు రావాల్సి ఉందన్నారు. ప్రధానంగా మాధవనగర్‌కు సంబంధించి రూ.3 కోట్లు, రివైజ్‌డ్ నిధులు రూ.8.5కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే అర్సపల్లి ల్యాండ్‌కు సంబంధించి సుమారు రూ.10 కోట్లు హోల్డ్‌లో ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి వారం రోజుల్లో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిని కలుస్తానని పేర్కొన్నారు. కేవలం అభివృద్ధి పనుల నిమిత్తం మాత్రమే కలుస్తానని ఆయన స్పష్టం చేశారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సీపీ



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నందున రాబోయే రెండు మూడు రోజులు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ప్రజల భద్రతా దృష్ట్యా 24 గంటలు పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీపీ ఆదేశాలు జారీ చేశారు. ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు వద్దకు వెళ్లవద్దన్నారు. జలాశయాలు, చెరువులు, కుంటలు చూడడానికి వెళ్లకూడదని, ప్రమాదానికి గురయ్యే అవకాశముందని స్పష్టం చేశారు. వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లే రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పొలాల్లో పడిపోయిన విద్యుత్ తీగలతో ప్రమాదం కలిగే అవకాశం ఉన్నందున రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. పురాతన కట్టడాలు లేదా పురాతనమైన ఇళ్లు పురాతనమైన గోడలు ఉన్నట్లయితే వర్షం తాకిడికి పడిపోయే అవకాశాలు ఉన్నాయని సీపీ హెచ్చరించారు. ఎక్కడైనా వరద ఉధృతి పెరిగిన సందర్భంలో పోలీసు సిబ్బంది, అధికారులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టి ప్రాణ నష్టం లేకుండా చూడాలని అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ, మున్సిపల్, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పశుసంవర్ధక, ప్రజా రవాణా, నీటిపారుదల వంటి అన్ని విభాగాలతో సరైన సమన్వయం చేసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర సమయంలో డయల్ 100కు లేదా పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 8712659700, లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ ఫోన్‌నంబర్లను సంప్రదించాలని సీపీ సాయిచైతన్య సూచించారు.



## పోచారం ప్రాజెక్టుకు జలకళ

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్ మండలాల వరప్రదాయిని పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకొని జలకలను సంతరించుకుంది. ప్రస్తుతం ఉన్న నీటిమట్టంతో రెండు పంటలు పండుతాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులు ఉండగా ప్రస్తుతం 20 అడుగుల వరకు నీటిమట్టం చేరుకుంది. ఈ మూడు రోజులపాటు వర్షాలు అధికంగా ఉండడంతో ప్రాజెక్టు, వాగుల వైపు ఎవరూ వెళ్లకూడదని నీటిపారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు ప్రజలను కోరారు. ప్రధాన కాలువ ద్వారా సైతం 120 క్యూసెక్కుల నీటిని పంటల సంరక్షణకు వదులుతున్నట్లు ఆయన తెలిపారు. పూర్తిస్థాయి నీటిమట్టానికి అడుగు నీటి మట్టం తక్కువ ఉన్నట్లు తెలిపారు.

## చెరువులు, కుంటల వద్దకు వెళ్లొద్దు



**అక్షరటుడే, కామారెడ్డి:** వచ్చే మూడు నాలుగు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు చెరువులు, కుంటల వద్దకు వెళ్లవద్దని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ప్రజలకు సూచించారు. కామారెడ్డి, అడ్లూరు ఎల్లారెడ్డి చెరువులను బుధవారం ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దన్నారు. సరదాగా గడిపేందుకు నిండుగా ఉన్న చెరువులు, కుంటల వద్దకు వెళ్లడం మానుకోవాలని సూచించారు. ఇంటికి వెళ్లే తొందరలో వరద ప్రవాహాలను దాటే ప్రయత్నం చేసి విలువైన ప్రాణాలు కోల్పోవద్దని హెచ్చరించారు. పాడుబడ్డ, కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్లలో ఉండేవాళ్లు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, తడి చేతులతో విద్యుత్ సరఫరా అయ్యే వస్తువులను తాకవద్దన్నారు. ఎస్పీ వెంట ఏఎస్పీ చైతన్య రెడ్డి, కామారెడ్డి రూరల్ సీఐ రామన్, ఎస్సై రంజిత్ ఉన్నారు.



సహకార సంఘాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

## అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి

**అక్షరటుడే , ఇందల్వాయి:** జిల్లాలో భారీ వర్ష సూచనల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తాము పనిచేస్తే స్థలాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. కార్యస్థానాల్లో ఉండని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిజామాబాద్ రూరల్ మండలంలోని తిర్మన్‌పల్లి, పాల్దా గ్రామాల్లో కలెక్టర్ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తిర్మన్‌పల్లి రైతు వేదికను కలెక్టర్ సందర్శించగా, వ్యవసాయ విస్తీర్ణ అధికారి (ఏఈవో) అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. అనంతరం తిర్మన్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. అక్కడి నుండి పాల్దా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాల్దా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకం తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శిని కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

**అక్షరటుడే, ఇందూరు:** భారీ వర్షాల నేపథ్యంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ దిలీప్ కుమార్ ఆదేశించారు. నగరంలోని హమల్‌వాడి, దుబ్బ బైపాస్ రోడ్, ఖానాపూర్, నిజాం కాలనీ, అర్సపల్లి, బోధన్ రోడ్, కెనాల్ కట్టా, శివాజీ నగర్ తదితర ప్రాంతాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. శానిటేషన్ విభాగం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు కాకుండా చూడాలన్నారు. ప్రధానంగా మురికి కాల్వలను శుభ్రం చేయాలని, చెత్తాచెదారం రోడ్లపై ఉండకుండా చూడాలని ఆదేశించారు. నివాస ప్రాంతాల్లో స్ప్రే చేయాలని చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైన చోట జేసీబీ వినియోగించాలని సూచించారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించాలని తెలిపారు. పాత భవనాలను గుర్తించి ఖాళీ చేయించాలని తెలిపారు. కమిషనర్ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మురళీ మనోహర్ రెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్లు, సానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు ఉన్నారు.






ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

## విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆగస్టు 13వ తేదీతో ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడొద్దని.. సరైన దారిలో వెళ్లాలని సూచించారు. చాలామంది యువకులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, తెలంగాణ ప్రభుత్వం మాదక ద్రవ్యాల వినియోగం కట్టడి చేయడం కోసం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం తగ్గించడానికి జిల్లా సంక్షేమ, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హన్మంత్ రావు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**అక్షరటుడే, బాన్సువాడ :** రానున్న నాలుగు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం డివిజన్ స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లల్ని, యువకులను ఈతకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చేపల వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పని ఉంటే తప్ప ఇళ్ల నుంచి బయటకు వెళ్లవద్దని కోరారు. అధికారులు అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల కారణంగా ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు అధికారులు తీసుకోవాలన్నారు. ప్రజలు వాగుల్లో, చెరువుల్లో చేపలు పట్టడానికి వెళ్లవద్దని చెప్పారు. గేదెల కాపర్లు జాగ్రత్తగా ఉండాలన్నారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో ప్రజలు బయటకు వెళ్లవద్దని చెప్పారు.



## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

**అక్షరటుడే, కోటగిరి:** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. బుధవారం రుద్రూర్ మండలంలోని చిక్కడ్ పల్లిలో ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి, అభ్యాస నైపుణ్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల విద్యా పురోగతిని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. అభ్యాస ఫలితాలను మెరుగుపరచడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మెరుగైన ఫలితాలను సాధించడానికి కృషి చేయాలన్నారు.




## మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం

**అక్షరటుడే, బాన్సువాడ:** మాదక ద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయని బాన్సువాడ ఎస్ఆర్ఎన్‌కే ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ గులాం ముస్తఫా అన్నారు. డ్రగ్స్ వ్యసనం అనేది కుటుంబం, ఆరోగ్యం, భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతుందని వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,3 ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిరోధక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఇతరులకు దూరంగా ఉంచేందుకు ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాల వినియోగంపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో యాంటీ నార్కోటిక్ బ్యూరో కమిటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ భగవాన్ రెడ్డి, డాక్టర్ రాజేష్, విఠల్, చిరంజీవి, అంబయ్య, కృష్ణ, రాజేష్ , శ్రీనివాస్, అనిత, సుధాకర్ రెడ్డి, మనోహర్, శేఖర్ పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

**అక్షరటుడే, కామారెడ్డి:** మూడు రోజుల క్రితం గడ్డిమందు తాగిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటన రామారెడ్డి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోగుల నాగరాజు (31) ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాడు. మనస్థాపంతో మూడు రోజుల క్రితం ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న నాగరాజు బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని బస్టాండ్ వద్ద రిలయన్స్ మాల్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఈ వ్యక్తి బుధవారం తెల్లవారుజామున మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

**ఈఎస్ఐ డిస్పెన్సరీలో సిబ్బంది కొరత వేధిస్తోంది. వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో కార్మికులకు వైద్యం అందడం లేదు. నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఉంది. ఇందులో పనిచేస్తున్న ఇద్దరు రెగ్యులర్ వైద్యులు సెలవులో ఉన్నారు. డిప్యుటేషన్‌పై వచ్చిన ఓ డాక్టర్ ప్రస్తుతం పని చేస్తున్నారు. వైద్యులు, సిబ్బంది కొరతతో సరైన వైద్యం అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.**

**- అక్షరటుడే, నిజామాబాద్ సిటీ**



# కార్మికులకు అందని వైద్యం

- ఈఎస్ఐ డిస్పెన్సరీలో సిబ్బంది కొరత
- సెలవులో వెళ్లిన వైద్యులు

ఏదైనా ప్రైవేట్ సంస్థలో 20 మంది కంటే ఎక్కువ మంది పని చేస్తే ఈఎస్ఐ సౌకర్యం కల్పిస్తుంది. దీంతో ఈఎస్ఐ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవచ్చు. డిస్పెన్సరీల్లో మందులు తీసుకునే వెసులు బాటు ఉంటుంది. కంఠేశ్వర్ డిస్పెన్సరీ కింద 17,712 మంది కార్మికులకు ఈఎస్ఐ కార్డులు ఉన్నాయి. దీంతో నిత్యం పదుల సంఖ్యలో రోగులు ఇక్కడికి వస్తుంటారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు డిస్పెన్సరీకి వస్తారు. ముఖ్యంగా దీర్ఘకాలిక రోగాలైన బీపీ, షుగర్ తదితర వ్యాధులతో బాధ పడేవారు ఎక్కువ సంఖ్యలో వస్తారు.

### ఒకరే డాక్టర్

ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ నామ్స్ ప్రకారం ప్రకారం 6 వేల నుంచి 8 వేల మందికి ఒక డాక్టర్ ఉండాలి. కంఠేశ్వర్ డిస్పెన్సరీ పరిధిలో కార్మికులు, కుటుంబ సభ్యులు కలిపితే దాదాపు 50 వేల మంది వరకు ఉంటారు. కానీ ఇక్కడ ఇద్దరు వైద్యులు మాత్రమే పనిచేస్తున్నారు. అందులో ఒకరు హైదరాబాద్ నుంచి డిప్యుటేషన్‌పై రాగా మరొక డాక్టర్ ఈ నెల నుంచి సెలవులో ఉన్నారు. సరిపడా వైద్యులు లేక సెంటర్‌కు వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడికి ఏమైనా సీరియస్ కేసులు వస్తే హైదరాబాదులోని నాచారం ఈఎస్ఐ ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారు.

### ఏళ్లుగా లీవ్‌లోనే..

కంఠేశ్వర్ ఈఎస్ఐ డిస్పెన్సరీలో విధులు నిర్వహిస్తున్న ఓ డాక్టర్ నాలుగైదు ఏళ్ల నుంచి సెలవులోనే ఉంటున్నారు. సంబంధిత డాక్టర్ ఉన్నత చదువుల కోసం కొన్ని సంవత్సరాలు లీవ్ పెట్టారు. అనంతరం మెటర్నటీ లీవులు పొందారు. డెలివరీకి ముందు ఆమె సెలవు పెట్టారు. ప్రసవం తర్వాత రెండు నెలలకు వచ్చి జాయిన్ అయ్యారు. అనంతరం మళ్లీ సెలవు పెట్టడం గమనార్హం. ఇదే ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న మరో డాక్టర్ ఆగస్టు 1 నుంచి వ్యక్తిగత కారణాలతో లీవ్‌పై వెళ్లారు. దీంతో ప్రస్తుతం డాక్టర్ వీణ ఒక్కరే సేవలు అందిస్తున్నారు.



### నియామకాలు కరువు

డిస్పెన్సరీలో సిబ్బంది కొరత వేధిస్తోంది. అవుట్ సోర్సింగ్ విధానంలో ఒక స్టాఫ్ నర్స్ మాత్రమే పనిచేస్తున్నారు. అలాగే ఫార్మసిస్టు రమేష్ 1988లో ఇక్కడ పోస్టింగ్ పొందారు. అప్పటి నుంచి ఆయన ఇక్కడే పనిచేస్తున్నారు. ఇదే ఆస్పత్రిలో సబార్డినేట్‌గా పనిచేసి 2002లో మృతి చెందిన మాణిక్యం కుమారుడిని 2003 మే 12న జూనియర్ అసిస్టెంట్‌గా నియమించారు. ఆయన కూడా అప్పటి నుంచి ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు.

### రోగులకు మందుల కొరత

కార్మిక బీమా ఆస్పత్రికి వచ్చే రోగులకు మందుల కొరత ఎదురవుతోంది. ఇక్కడకు ఎక్కువ శాతం బీపీ, షుగర్ ఉన్నవారు వచ్చి మందులు తీసుకుంటారు. అయితే ఆ మందులు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గర్భిణులు కూడా ఎక్కువ సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. వారికి కావాల్సిన మందులు కూడా ఉండడం లేదు.

## రామాలయానికి రూ.25 లక్షలు మంజూరు

**అక్షరటుడే, ఇందల్వాయి:** మండలకేంద్రంలోని సీతారామచంద్ర ఆలయానికి రూ.25లక్షలు మంజూరయ్యాయి. రూరల్ ఎమ్మెల్యే ఆర్ భూపతిరెడ్డి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు కాగా, ఈ మేరకు ప్రొసీడింగ్ కాపీ అందజేశారు. దీంతో వీడీసీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయనను కలిసి విన్నవించారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నవీన్‌గౌడ్, సహకార సంఘ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ముత్తెన్న పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

**అక్షరటుడే, నిజాంసాగర్:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు పలువురు వారి సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణంలో అవకతవకలు, అవినీతికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇల్లు మంజూరు కానివారు ఆందోళన చెందవద్దని, అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేసేలా కృషి చేస్తామని చెప్పారు.



## కోతుల భయంతో భవనంపై నుంచి దూకిన విద్యార్థిని.. చికిత్స పొందుతూ మృతి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** కోతుల మీదకు వస్తున్నాయనే భయంతో ఓ విద్యార్థిని భవనంపై నుంచి దూకింది. తీవ్రగాయాలవడంతో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని దుబ్బ ప్రాంతానికి చెందిన కావేరి ఆర్మూర్ మండలం మామిడిపల్లి వద్ద కేజీబీవీ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. బంగ్లాపై ఉన్న హాస్టల్లో ఉంటున్న విద్యార్థి వాష్‌రూమ్ కోసమని బయటకు వచ్చింది. బిల్డింగ్‌పై కోతుల మందను చూసిన కావేరి ఒక్కసారిగా ఉలిక్కిపడి భవనం పైనుంచి దూకేసింది. గమనించిన విద్యార్థులు స్థానికుల సహాయంలో హుటాహుటిన కావేరిని సోమవారం రాత్రి నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ విద్యార్థి బుధవారం ఉదయం మృతి చెందింది. విద్యార్థిని మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని కాపాడాలి

**అక్షరటుడే, బాన్సువాడ:** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మోదీ కార్పొరేట్ ప్రభుత్వాన్ని భారతీయులు తరిమి కొట్టి దేశాన్ని రక్షించుకోవాలని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ పిలుపునిచ్చారు. సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐఎడబ్ల్యూ, కేంద్ర కమిటీల పిలుపు మేరకు బుధవారం వర్నిలో 'కార్పొరేట్ కో హటావో దేశ్ కో బచావో' నినాదంతో బైక్ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. అనంతరం సుభాష్ చంద్రబోస్ చౌరస్తా వద్ద నన్నేసాబ్ మీడియాతో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పిందని మండిపడ్డారు. దేశాన్ని, దేశ సంపదను కాపాడుకునే బాధ్యత ప్రతి భారతీయుడిపై ఉందన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, రవీందర్, సాయిలు, శ్రీనివాస్, మారయ్య, భూమయ్య, గంగారాం పాల్గొన్నారు.

## ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ రవాణా..

**అక్షరటుడే నిజాంసాగర్:** ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరా పేరుతో పలువురు అక్రమార్కులు ఇష్టారాజ్యంగా అక్రమ రవాణా చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ రేటుకే ఇసుకను సరఫరా చేస్తోంది. అయితే దీనిని సాకుగా తీసుకుని ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. 'ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక' పేరుతో ఫ్లెక్సీలు లేకుండానే ట్రాక్టర్లలో దర్జాగా ఇసుకను తోలుతున్నారు. జుక్కల్ మండలం మీదుగా ప్రభుత్వం అనుమతి పొందిన ట్రాక్టర్‌కు రూ.900 చెల్లించి దర్జాగా అదే ట్రాక్టర్‌ను రూ.9వేలకు పక్క రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇలా తరలిస్తున్న ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు పక్కా సమాచారం మేరకు పట్టుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఇది జరిగిన మరుసటి రోజే మళ్లీ ఇసుకను దర్జాగా ఇతర ప్రాంతాలను తరలిస్తుండడం విస్మయానికి గురిచేస్తోంది. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను సరఫరా చేసే ట్రాక్టర్లకు గతంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ట్రాక్టర్ ముందుభాగంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇసుక పేరుతో ఫ్లెక్సీలు ఉండేవి. ప్రస్తుతం అవేమీ లేకుండానే దర్జాగా ఇసుకను మంజీర నుంచి తోలుతున్నారు. దీంతో అసలు ఇసుకను ఇందిరమ్మ ఇళ్లకు సరఫరా చేస్తున్నారా.. లేక అక్రమంగా పక్కనే ఉన్న ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారా అనేది అనుమానంగా ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా విలువైన ఇసుకను పక్కా రాష్ట్రాలకు తరలించకుండా పోలీసులు గట్టినిఘా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



## డోంగ్లీ మండల ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



**అక్షరటుడే, నిజాంసాగర్:** డోంగ్లీ మండల ప్రెస్ క్లబ్ నూతన కమిటీని బుధవారం మండల విలేకరులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.మారుతి, ఉపాధ్యక్షుడిగా బషీర్, జనరల్ సెక్రెటరీగా మనోహర్, సెక్రెటరీగా బస్వరాజ్, కోశాధికారిగా లక్ష్మణ్, సలహాదారుడిగా కిరణ్, సభ్యులుగా నామేవార్ చంద్రకాంత్, జె.మాధవ్, డి.రాజును ఎన్నుకున్నారు. నూతన కమిటీని పలువురు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.




## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని 17వ వార్డుకు చెందిన ఉమర్ షేక్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. అనంతరం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా.. ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్‌రెడ్డి ఆయనకు రూ. 9వేల చెక్కును బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఏఎంసీ ఛైర్మన్ సాయిబాబా గౌడ్, నాయకుడు పవన్ పండిట్, మురళి, ఖాందేశ్ శ్రీనివాస్, బాల్ రెడ్డి, అజ్జుబాయ్, నదీం, మాజీ సర్పంచ్ సదాశివ్ తదితరులు పాల్గొన్నారు.



## వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** రాబోయే నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో పార్థసింహారెడ్డి అన్నారు. బుధవారం తన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. భారీ వర్షాల నేపథ్యంలో పిల్లలు, యువకులు ఈతకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జాలర్లు చేపల వేటకు వెళ్లవద్దని, అత్యవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రావద్దన్నారు. భారీ వర్షాల సమయంలో అధికారులు అందుబాటులో ఉంటూ అత్యవసర పరిస్థితులలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాల కారణంగా ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు అధికారులు తీసుకోవాలని సూచించారు. ప్రజలు వాగులు, చెరువులు పొంగిపొర్లుతున్న సమయంలో వెళ్లవద్దని, గేదెల కాపర్లు జాగ్రతగా ఉండలన్నారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ మహేష్, ఫైర్ అధికారి వినోద్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.



## వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**అక్షరటుడే, నిజాంసాగర్:** నిజాంసాగర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రామ్మోహన్ గుప్తా కుమారుడి వివాహ వేడుకలు బుధవారం కామారెడ్డి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. వివాహ వేడుకకు జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ దుర్గారెడ్డి 'మనకోసం మనం' స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు కిషోర్ కుమార్ నాయకులు తదితరులున్నారు.